క్లుప్తంగా

నేడు ఎమ్మార్పీఎస్ సమావేశం

మండపేట: ఎస్సీ వర్గీకరణ సాధనకు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా స్థాయి సమావేశం మంగళవారం మండపేటలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత దూలి జయరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగలు, ఉపకులాల వారిని చైతన్యం చేసి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ నేతృత్వంలో రానున్న ఎన్నికల నాటికి మరో పోరాటానికి సిద్ధం చేయడమే తమ లక్ష్యమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మహాజన సోషలిస్ట్ పార్టీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

వినయ్‌కు అభినందన



వినయ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

మండపేట: పదో తరగతి పరీక్షల్లో తాపేశ్వరం లోని శ్రీపోలిశెట్టి సత్తిరాజు శ్రీమతి భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వెంకట వినయ్ 584 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కలెక్టర్ హిమాన్షుశుక్లా, జేసీ ధ్యానచంద్ర అభినందించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వినయ్‌ను కలెక్టర్ శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. డీఈఓ కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ...



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ భవాని, తదితరులు

రామచంద్రపురం రూరల్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన వేగాయమ్మపేట మహాలక్ష్మమ్మ హిందూ గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులను ఎంపీపీ అంబటి భవాని అభినందించారు. పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులు మోర్త స్వాతిముత్యశ్రీ, కుడుపూడి శంకరనారాయణ, పెమ్మాడ దీనలను శాలువాలు కప్పి, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి తుకారం, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుడుపూడి రమణ, ప్రధానోపాధ్యాయుడు వడ్లమాని సోమసుందరం, ఉపాధ్యాయులు కారుమూరి సత్యనారాయణ(నాగు మాస్టారు), ఎల్.శ్రీలక్ష్మి, జి. శివభాను, పీఈటీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు సరకులు అందజేస్తున్న చంద్రశేఖర్ తదితరులు

కె.గంగవరం: మండలంలో కూళ్ల, రాజువైరు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు సోమవారం దాతలు నిత్యావసర సరకుల పంపిణీ చేశారు. కూళ్ల శివారు మేడకాడ కాలనీకి చెందిన కుంచే చంద్రరరావు, రాజువైరి గ్రామానికి చెందిన తిరుకోటి సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యలను పరామర్శించి డొక్కా సీతమ్మ ఆసరా పథకం తరుపున బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు



వట్రపూడిలో ఉపాధి కూలీలకు సూచలిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల పరిధిలోని అద్దంపల్లి, వట్రపూడి, యర్రపోతవరం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు ముందుగా ప్రాధాన్యత ఉన్న పంట బోదులను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి రాంబాబు, నాయకులు పంపన సుబ్బారావు, చింతపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలకు యమ గిరాకీ

- అకాల వర్షాలతో వరి కోత యంత్రాలకు డిమాండ్
- పెరిగిన అద్దె, అన్నదాత ఆందోళన



మొగలిపాలెంలో వరికోత యంత్రంతో పంటను కోయిస్తున్న రైతులు

కాజులూరు: అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. దిగుబడి ఆశాజనకంగా ఉండి పంట చేతికందుతుందన్న తరుణంలో వారం రోజుల పాటు తెరిపివ్వకుండా కురిసిన వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పనలపై ఉన్న పంట నీటిపాలైంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం నేలపాలైంది. వర్షాలు వీడిన తర్వాత ఉన్న పంటను దక్కించుకునేందుకు అన్నదాతలు నానా హైరానా పడుతున్నారు. కూలీల కొరతతో వరికోత యంత్రాలతో మాసూళ్లు నిర్వహించాల్సి వస్తోంది. అయితే రైతులందరూ ఒకేసారి పనులు చేపట్టడంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. దీనిని అదునుగా తీసుకుని వ్యాపారులు యంత్రాలకు అద్దే పెంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 56 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. వర్షాల సమయానికి కె.గంగవరంలో 40 శాతం, రామచంద్రపురం మండలంలో 50 శాతం కోతలు పూర్తవ్వగా కాజులూరు మండలంలో 18,076 ఎకరాల సాగుకు గానూ అధికారిక లెక్కల కేవలం 3175 ఎకరాల్లో మాత్రమే మాసూళ్ల జరిగాయి. మిగిలిన పొలంలో పంట కోతకోయాల్సి ఉంది.

కూలీల కొరత

వర్షాల నేపథ్యంలో త్వరగా మాసూళ్ల పూర్తి చేయాలని, లేదంటే గింజ రాలిపోయే ప్రమాదముందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతో రైతులంతా ఒకేసారి వరికోతలు చేపట్టడంతో కూలీలు దొరకడం కష్టంగా మారింది. ఒక వేళ కూలీలు దొరికినా కూలి ఎక్కువవుతోంది. దీంతో అందరి దృష్టి వరికోత యంత్రాలపైనే పడింది. మండలంలో రైతుమిత్ర సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు కోత మెషీన్లతో కలిపి కేవలం 30 కోత మెషీన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలకు ముందే మాసూళ్లు పూర్తయ్యాయి. వర్షాలు తగ్గిన తర్వాత ఇక్కడ ఎర్పడిన డిమాండ్ దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు పక్క జిల్లాల నుంచి వరికోత యంత్రాలను తెప్పించుకున్నారు. ప్రస్తుతం మండల గ్రామాలలో 60 వరకూ వరికోత యంత్రాలు నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు వాతావరం కాస్త తెరపిచ్చినా బంగాళాఖాతంలో మరో తుఫాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన అద్దె

అందరూ ఒకేసారి పనులు మొదలుపెట్టడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టుగా అద్దెలు పెంచేస్తున్నారు. వర్షాల సమయానికి నియోజకవర్గ గ్రామాల్లో వరికోత కోయడానికి ఎకరానికి రూ.2500 నుంచి రూ.2600 వరకూ ఉండేది. ఎకరం పొలంలో పంట కోత కోయడానికి గంట సమయం పట్టేది. ఇప్పుడు గంటన్నర సమయం పడుతోంది. గంటకు రూ.3000 తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఎకరానికి పంట కోతకోయడానికి రూ.4500 వరకూ ఖర్చవుతుందని రైతులు అంటున్నారు.

రాయితీపై వరికోత యంత్రాలు

వరికోత యంత్రాల ధర రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ ఉంటుంది. స్థానిక రైతులు అంత ధరపెట్టి యంత్రాలు కొనలేకపోవడంతో కొందరు నిర్వాహకులు పక్క జిల్లాల నుంచి యంత్రాలను రప్పించి, అద్దే ధరలు పెంచి వసూళ్ల చేస్తున్నారని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ప్రభుత్వం ద్వారా 40 శాతం రాయితీపై వరికోత యంత్రాలను రైతులకు అందిస్తోందని రైతులు రైతు మిత్ర సంఘాలుగా ఏర్పడి ఆర్‌బీకేలలో దరఖాస్తులు చేసుకోవటం ద్వారా వరికోత యంత్రాలను పొందవచ్చని చెబుతున్నారు.

అన్నదాతకు ఊరట

- తెరిపిచ్చిన వాతావరణం
- పంట ఒబ్బిడి పనుల్లో రైతులు



మండపేటలో ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించేందుకు బస్తాల్లో ధాన్యం నింపుతున్న రైతులు

మండపేట: ద్రోణి ప్రభావంతో గత కొద్ది రోజులుగా కంటి మీద కునుకులేకుండా చేసిన వాతావరణం తెరిపివ్వడం రైతులకు ఊరటనిచ్చింది. సోమవారం ఎక్కడ చూసిన కళ్లాల్లోని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమవ్వడం కనిపించింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 92,862 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. 60 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తి కాగా అధిక శాతం ధాన్యం కళ్లాల్లోనే ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాతావరణానికి జడిసి గత మూడు రోజులుగా రైతులు వరి కోతలు బంద్ చేశారు. ధాన్యం తడవకుండా బరకాలు కప్పి ఉంచారు. అయినప్పటికి అక్కడక్కడ రాశుల్లో ధాన్యం తడిశాయి. ప్రస్తుతం ఎండలు బాగా ఉండడంతో ఎక్కడికక్కడ రైతులు వరికోతలు, కళ్లాల్లోని ధాన్యాన్ని ఒబ్బిడిచేసుకుంటున్నారు.

ఆందోళన కలిగిస్తున్న తుపాను హెచ్చరికలు

రెండు రోజుల్లో తుపాను రానున్నట్టు వాతావరణ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈలోగా పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరు రైతులు ఆరిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు తరలించగా, పంటను ఒబ్బిడి చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మరో పదిరోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే పూర్తి స్థాయిలో రబీ మాసూళ్లు పూర్తవుతాయని రైతులు అంటున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



వల్లూరులో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం నాణ్యతను చూస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో రైతుకు తోడుగా నిలవాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండలంలోని వల్లూరు, వెదురుమూడి, అంగర, తదితర గ్రామాలను సోమవారం ఆమె సందర్శించారు. రహదారిపై ఆరబెట్టిన ధాన్యం నాణ్యతను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం తడిచినప్పటికీ ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని, ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని రైతులకు భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు వివరాల నమోదు తీరుపై ఆర్బీకే వ్యవసాయ సహాయకులను ఆరా తీశారు. సంచులను సమకూర్చడంపై పీఏసీఎస్ అధికారులతో మాట్లాడారు. చివరి గింజ కొనే వరకూ పర్యవేక్షణను కొనసాగించాలని తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్‌లను ఆదేశించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాజులూరు: వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బీజేపీ అమలాపురం పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి తదితర గ్రామాల్లో ఆ పార్టీ నేతలతో కలిసి శంకరనారాయణ పంట పొలాలను పరిశీలించారు. అధికారులు వెంటనే పంటల నష్టంపై అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించాలని, ప్రతి రైతుకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నిబంధనలు సడలించాలి

కె.గంగవరం: ప్రభుత్వ తడిసిన, రంగు మారి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వైద్యనాథ్ శర్మకు అందించారు. రావి భాను, గారపాటి రామకృష్ణ చౌదిరి, జంగం ధనరాజు, యలమంచిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో గ్రామ సర్పంచ్ అరుణ, ఎస్సై వినోద్ తదితరులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 14వ రాష్ట్రస్థాయి ఇన్విటేషనల్ కెన్యూరియో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారిని గ్రామ సచివాలయంలో సోమవారం అభినందించారు. సీనియర్ విభాగంలోని వివిధ అంశాల్లో ద్రాక్షారామ స్కైలార్క్ పాఠశాలకు చెందిన వి.శ్యామ్, ఎం.అభిరామ్, ఆర్.సూర్య, జెడ్పీ హైస్కూల్ నుంచి బి.దుర్గాప్రసాద్ మొదటి స్థానంలో నిలిచారు. జూనియర్ విభాగంలోని వివిధ అంశాల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జి.కిరణ్, బి.ఆంజనేయులు, ఎ.పరిశుద్దు, జి.జశ్వంత్, గాయత్రి స్కూల్ నుంచి ఎ.చైతన్యశ్రీ ద్వితీయ స్థానం సాధించారు. జి.అభిరామ్, ఎ.సంతోష్, కె.విష్ణు మూడో స్థానంలో నిలిచారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణను సీనియర్ కరాటే మాస్టర్ బీకే రత్నం, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యుడు యండమూరి ఈశ్వరరావు, ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ అభినందించారు.

30 మందికి కంటి పరీక్షలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి సచివాలయం–02 పరిధిలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 25 మందికి ఉచితంగా కంటి పరీక్షలను చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 12 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ముగ్గురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు రమ్య, ప్రశాంతి, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో గౌతమి గోదావరి ఒడ్డున నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలను మంగళవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఆలయం వద్ద యాగశాల నిర్మాణం పూర్తయింది. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ 11న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

బాస్కెట్ బాల్ ఉచిత శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభించిన చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలోని శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో 18వ బాస్కెట్ బాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ దంపతులు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ఎందరో రామచంద్రపురం బాస్కెట్ బాల్ శిక్షణ పొంది ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని చిన్నారులు వేసవి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కోట సతీష్‌కుమార్, హెచ్ఎం పోలిశెట్టి రాంబాబు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ సభ్యులు గరికపాటి జానకిరామ్, బాబు, పీడీలు అప్పాజీ, శ్రీనివాస్, అప్పన్న, కృష్ణమోహన్, రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు నాలుగు అర్జీలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వాకాడ అమ్మాజీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో నాలుగు అర్జీలు అందినట్టు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. వడిశలేరు గ్రామానికి చెందిన వినజమూరి జయమ్మ పింఛను ఇప్పించాలని, కోటపాడు గ్రామ పంచాయతీకి చెందిన చెట్లను అనుమతి లేకుండా తొలగించారని ఫిర్యాదు చేశారన్నారు. వడిశలేరు గ్రామానికి చెందిన కుందేటి వెంకటరమణ, ఎస్టీ రాజాపురం గ్రామానికి చెందిన తేలి అప్పారావు సర్వే నంబరు 139లోని భూమి తనకు చెందిందని, తన భూమి తనకు అప్పగించాలని, చంద్రేడు మాదిగ కాలనీలో వర్షపునీరు నిలిచి ఉండిపోతుందని ఇబ్బంది పడుతున్నామని, వెంటనే చర్యలు చేపట్టాలని మాదిగ కాలనీ వాసులు అర్జీలు సమర్పించినట్టు ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అర్జీలు బదిలీ చేసినట్టు అమ్మాజీ తెలిపారు.

సచివాలయం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: సచివాలయం ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, లేకుంటే వారిపై తగు కఠిన చర్యలు తీసుకుంటారని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి హెచ్చరించారు. ఆయన కైకవోలు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు, హాజరపట్టిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో విధులకు హాజరై బయోమెట్రిక్, హాజరుపట్టిలో సంతకాలు చేయాలన్నారు. పలు గ్రామాల్లో ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారని, విధులపై నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి చిన్ని, ఇతర సిబ్బంది ఉన్నారు.

పింఛనుదారులు ఈ-కేవైసీ చేయించుకోండి

అనపర్తి: పింఛనుదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అనపర్తి ఉప ఖజానా అధికారి దాక్షాయణి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు ఎవరికి వారు ఈ నెల 11వ తేదీలోగా ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు ఉప ఖజానా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్నల్ ఆడిట్



ఆలమూరు పాఠశాలలో ఇంటర్నల్ ఆడిట్ పర్యవేక్షిస్తున్న విద్యాశాఖాధికారులు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇంటర్నల్ ఆడిట్ జరిగింది. ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆడిట్‌ను జిల్లా సమగ్ర శిక్ష ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ పి.రాంబాబు పర్యవేక్షించారు. విశాఖపట్నం ఆర్‌బీ అసోసియేట్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్లు కె.కార్తీక్, పి.అక్షయరెడ్డి ఇంటర్నల్ ఆడిట్‌ను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి 2022–23 సంవత్సరానికి చెందిన రికార్డులు తనిఖీ చేసి పకడ్బందీగా ఆడిట్ నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.నాగేశ్వరి సీఆర్‌పీలు యడ్ల అపర్ణ, గంటి శ్రీనివాసు, మేరింకుమారి పాల్గొన్నారు.

17న ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజానగరం: జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామని ఎంపీడీఓ బి.రామారావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు మండలంలో గ్రామ సభలు నిర్వహించి, ఆయా ప్రాంతాల్లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ చేస్తారన్నారు. ఎక్కడైనా, ఏవిధమైన అవకతవకలు జరిగినా ప్రజలు ప్రశ్నించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఏ అగస్టిన్ కుమార్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు



కాజులూరులని గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



వేసవి శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారి అరుణ

రాయవరం: మాచవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. లైబ్రేరియన్ ప్రమీల మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాన్ని వేసవి సెలవులు ముగిసే వరకూ నిర్వహించనున్నట్టు తెలిపారు.విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయత కేవీవీ సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వేసవి సెలవులు విజ్ఞానదాయకం కావాలని స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభ కార్యక్రమంలో వక్తలన్నారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సోమవారం సర్పంచ్ సాకా శ్రీనివాస్, సామాజిక కార్యకర్త చిట్టూరి సత్యనారాయణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఖాళీ సమయంలో పక్కదారి పట్టకుండా విద్యార్థులకు గ్రంథాలయంలోని శిబిరంలో నిర్వహించే కార్యక్రమాలు విజ్ఞాన సముపార్జనకు ఉపకరిస్తాయన్నారు. గ్రంథాలయాధికారి శివకుమారి మాట్లాడుతూ గ్రంథపఠనం, కథలు చెప్పడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రవితేజ, సతీష్, సురేష్, ఉపాధ్యాయురాలు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపెల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు

కాజులూరు: పుస్తక పఠనం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందని కాజులూరు గ్రంథాలయాధికారి కేఎస్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకూ ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు గ్రంథాలయ అధికారిణి వి.అరుణ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్రాంత అధ్యాపకులు బి.శివరారావు, కె.రామసుబ్బారావు, బి.చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం విజ్ఞానం, వినోదం పెంపొందేలా ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి శిక్షణ పోస్టర్‌నను ఆవిష్కరించారు.

నేటి నుంచి పళ్లాలమ్మ తీర్థం



పళ్లాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆ దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న తెలిపారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి తీర్థం ప్రారంభమై నెలరోజుల పాటు జరుగుతుంది. ఈ తీర్థోత్సవాలకు కోనసీమ నుంచే కాకుండా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచీ అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ కమిటీ చైర్మన్ అమ్మన్న ఆధ్వర్యంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మణికుమార్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పళ్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. రాత్రి పెద్ద జాతర, మంగళవారం నుంచి అమ్మవారి తీర్థమహోత్సవాలు సందర్భంగా స్వర్ణ, రజిత ఆభరణాలతో అలంకరించిన పళ్లాలమ్మ అమ్మవారిని జగ్గిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కమిటీ సభ్యులు, దేవస్థానం అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గిరెడ్డితో పాటు అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, రాష్ట్ర నాయకుడు కె.నాగిరెడ్డి, స్థానిక నాయకులు డి.మాధవరావు, వసుం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలపై కేసు నమోదు చేయాలి

మండపేట: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే హత్యకు కుట్రలు పన్నుతున్న కర్ణాటకలోని చిత్తాపూర్ బీజేపీ అభ్యర్థి మణికంఠ రాథోడ్, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాలపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎం.అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏఐసీసీ పిలుపు మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పార్టీ నాయకులు మగ్గం జాకబ్ రాజు, కొడవళ్ల సుబ్బారావు, పిల్లి అప్పన్న, కె.ప్రసాద్, కె.దుర్గారావు తదతరులు పాల్గొన్నారు.